క్లుప్తంగా

రాష్ట్రావతరణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): తెలంగాణ రాష్ట్ర దశాబ్ది అవతరణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా రాణి, కమిషనర్ రాజేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొల్లారం మున్సిపాలిటీలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, ఈ ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

యోగేశ్వరశర్మకు అవార్డు


అవార్డును అందుకుంటున్న యోగేశ్వరశర్మ

జోగిపేట(అందోల్): జోగిపేటలోని వినాయక దేవాలయ అర్చకులు చిద్రావార్ యోగేశ్వర్‌శర్మను త్రినయన సాంస్కృతిక కళానిలయంలో సాంస్కృతిక సేవా సంస్థ హైదరాబాద్ వారు వైదిక పురోహితరత్న నంది అవార్డుతో సత్కరించారు. తాళ్లపాక అన్నమాచార్యులు 615వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో యోగేశ్వర్‌శర్మ నంది అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, పలువురు ప్రముఖులు హాజరైయ్యారు.

సంగయ్యస్వామికి పురోహితరత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న సంగయ్యస్వామి

నారాయణఖేడ్: మండల పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన పురోహితుడు మడపతి సంగయ్యస్వామి పురోహితరత్న అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లో అక్కడి త్రినయ సాంస్కృతిక సేవా సంస్థ చక్రవర్తి తాళ్లపాక అన్నమాచార్యుల 615వ జయంతిని పురస్కరించుకొని అవార్డుకు గాను సంగయ్యస్వామిని ఎంపిక చేశారు. శనివారం హైదరాబాద్ కళానిలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, దైవాజ్ఞశర్మ తదితరులు అవార్డును అందజేశారు. తనకు అవార్డును అందజేయడం పట్ల సంగయ్యస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

పరీక్షలు రాసేందుకు అనుమతి


ఎంఈఓ నుంచి జీఓ కాపీని అందుకుంటున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: తమకు అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు రాసేందుకు అనుమతి ఇచ్చినందుకు విద్యాశాఖ అధికారులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు గుర్తింపులేనందునా యాజమాన్యం నిర్వాహకంతో పదవ తరగతి రెగ్యులర్ పరీక్షలు రాసేందుకు అనుమతించకపోవడం తెలిసిందే. మంత్రి హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, కమిషనర్ దేవసేనా, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంఈఓ బస్వరాజ్ కృషితో తమకు పరీక్షలు రాసే అవకాశం లభించిందన్నారు. వచ్చే జూన్ నెలలో అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించారని, సంవత్సరం నష్టపోకుండా తమను ఆదుకున్న అధికారులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

జోగిపేట(అందోల్): రాబోయే మూడు మాసాల్లో నూతన ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అందోల్ తహసీల్దారు వెంకటేశ్ అన్నారు. శనివారం జోగిపేటలోని తహసీల్దారు కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతిఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. అదేవిధంగా ఓటర్ల నమోదు, తొలగింపులపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు (ఎన్నికలు) చంద్రశేఖర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు చాపల వెంకటేశం పాల్గొన్నారు.

కాల్వలు.. కబ్జా పర్వం

- రియల్ వ్యాపారులకు ఇరిగేషన్ అధికారుల అండదండలు
- రాత్రింబవళ్లు కొనసాగుతున్న పనులు
- ఆందోళనలో ముంపు కాలనీలవాసులు


గతేడాది కాలనీలో వరదనీటిలో పర్యటిస్తున్న అధికారులు, నాయకులు (ఫైల్)


బంధం కొమ్ము కాలువలో మట్టి నింపుతున్న దృశ్యం

పటాన్‌చెరు: నియోజకవర్గం పరిధిలోని అమీన్‌పూర్ పెద్ద చెరువు, బంధం కొమ్ము చెరువు కాలువలు కబ్జాలకు గురవుతున్నాయి. శంభునికుంట నామరూపాల్లేకుండా పోతోంది. దీంతో ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. కబ్జాకు గురైన బంధం కొమ్ము చెరువు కాలువపై వెలుస్తున్న ఓ బహుళ అంతస్తు నిర్మాణానికి హెచ్‌ఎండీఏ అనుమతులు ఎలా ఇచ్చిందని ఇటీవల స్థానిక ప్రతిపక్ష నేత కాట శ్రీనివాస్‌గౌడ్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా నోటీసులు ఇచ్చామని దాటవేశారు. వింతైన విషయం ఏమిటంటే ఏ బడా సంస్థలైతే అమీన్‌పూర్ చెరువుల కాలువల ఎఫ్‌టీఎల్‌ను చెరపట్టి సర్వనాశనం చేశారో ఆ సంస్థలకే ఆ చెరువుల సుందరీకరణ పనులు అప్పచెప్పి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పాలకవర్గం కబ్జాదార్లకు సహకరిస్తోందనే ఆరోపణలను ఇప్పటికే మూట కట్టుకుంది.

రాత్రింబవళ్లు కాలువను పూడ్చే పనులు

బంధం కొమ్ము చెరువు కాలువపై ఓ బహుళ అంతస్తు నిర్మాణానికి హెచ్‌ఎండీఏ అనుమతులు ఇవ్వడంతో రాత్రింబవళ్లు ఆ కాలువను పూడ్చేందుకు లారీల్లో మట్టి తెచ్చి పోస్తున్నారని ఇరిగేషన్‌శాఖ అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక కాలనీవాసులు వాపోతున్నారు. కాలువల్లో ఇష్టానుసారంగా మట్టిని నింపుతుండటంతో ముంపు ప్రాంతాలైన ఎన్‌బీఆర్ ఎంక్లేవ్, దినేష్ హోమ్స్, శివసాయినగర్ కాలనీ, నారాయణరెడ్డి ఫేస్–2 కాలనీ, ఎస్‌ఎస్‌ఎల్ కాలనీ, భవానీపురం కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. గత వర్షాకాలంలో ఈ కాలనీలన్ని జలమయమం కావడంతో అధికారులు పర్యటించినప్పటికి నేటికీ సమస్య పరిష్కారం కాకపోగా తాజాగా కాలువల పూడికతో మరిన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం

అమీన్‌పూర్‌లోని చెరువుల కాలువల కబ్జాపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. కబ్జాలు, మట్టి పూడికపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం. మండే మార్కెట్‌లో వెలుస్తున్న భవంతికి ఇరిగేషన్ శాఖ ఎన్‌ఓసీ ఇవ్వలేదు. ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉంది. కోర్టు అనుమతులు రాగానే చర్యలు తీసుకుంటాం.
– ప్రసాద్, ఏఈ, ఇరిగేషన్‌శాఖ, అమీన్‌పూర్ మున్సిపాలిటీ

మిషన్ భగీరథతో ఇంటింటికీ తాగునీరు


నారాయణఖేడ్: పీర్లతండాలో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

– ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మిషన్ భగీరథ పథకంతో నేడు ఇంటింటికీ తాగురు అందుతోందని ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పీర్లతండాలో రూ.24లక్షలతో నిర్మించనున్న ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాగునీటికి తండావాసులు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటికీ నల్లాల ద్వారా నీరు అందుతోందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మిబాయిరవీందర్‌నాయక్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హన్నాన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పరమేశ్వర్, సర్పంచ్ రాజేష్, ఎంపీటీసీ జగదేవి, రైబస అధ్యక్షులు సత్యపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జీవులానాయక్ పాల్గొన్నారు.

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండలం ఔదత్‌పూర్ పంచాయతీ పరిధిలో శనివారం తాగు ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.29.59లక్షలతో ఓహెచ్ఆర్ తాగునీటి ట్యాంకు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్ నాయక్, వైస్ ఎంపీపీ పండరి యాదవ్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ సత్యపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పరమేశ్, పండరి యాదవ్, సర్పంచ్‌లు రాజు, సంజీవ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


మనూరు: ఔదత్‌పూర్‌లో..

కాంగ్రెస్, బీజేపీ నేతలకు గుణపాఠం చెప్పాలి

కల్హేర్(నారాయణఖేడ్): ఓట్ల కోసం తప్పుడు మాటలు చెపుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులకు గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సిర్గాపూర్ మండలంలోని అంతర్‌గాం తండాకు రూ.91లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణం పనులకు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు తండాలను అభివృద్ధి చేయకుండా అవినీతికి పాల్పడ్డారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గిరిజన తండాల్లో అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. తండాలను ప్రత్యేకంగా గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీలు రాఘవరెడ్డి, నర్సింహరెడ్డి, సర్పంచ్ రవీందర్ పాటిల్, నాయకులు మాధవరావు పాటిల్, రాములు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాసులు

మనూరు(నారాయణఖేడ్) మనూరు మండలంలోని స్థానిక ఐకేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన దివ్యాంగుల బస్‌పాసుల మేళాలో 25మంది దివ్యాంగులకు బస్‌పాసులు మంజూరు చేసినట్లు నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశయ్య తెలిపారు. అర్హులైన వారు, సదరం సర్టిఫికెట్ కలిగిన వారు బస్‌పాసులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వంశీకృష్ణ, వికలాంగ సంఘం అధ్యక్షుడు దత్తు, సీసీలు సంగన్న, నాగమణి, తుకరాం, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు పాల్గొన్నారు.


బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్న అధికారులు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


పూజలు చేస్తున్న భక్తులు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మారేపల్లి గ్రామంలో లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం సామూహిక లక్ష్మీనారాయణ హోమం, తల్లిదండ్రుల పాద పూజ నిర్వహించారు. ఆదివారం లక్ష్మీనారాయణస్వామి కళ్యాణ మహోత్సవాన్ని వైకుంఠపురం ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఆధర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో సంజీవరెడ్డి

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండల పరిధిలోని గౌడ్‌గాముకు చెందిన బీఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి, మాధవరావు, శివారెడ్డి, మహిపాల్ తదితరులు శనివారం నారాయణఖేడ్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో సిర్గాపూర్, కంగ్టి మండలాల కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, అర్జున్, జ్ఞానేశ్వర్‌పాటిల్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పటాన్‌చెరు టౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్‌ఆర్‌ఆర్ (రియూస్, రీసైకిల్, రెడ్యూస్) కార్యక్రమంలో భాగంగా మైత్రి క్రీడా మైదానంలో శనివారం చెత్త సేకరించే సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వస్తువులు రీసైక్లింగ్ చేయడం ద్వారా గాలి, నేల, నీటి కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. పర్యావరణాన్ని కలుషితం చేసే ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లిని కోల్పోయిన పిల్లలకు సాయం


నారాయణఖేడ్: సరుకులు అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

నారాయణఖేడ్: కంగ్టి మండల పరిధిలోని ముర్కుంజాల్‌కు చెందిన అశ్విని ఇటీవల కవల పిల్లలకు జన్మనిచ్చి కన్నుమూసింది. పేద కుటుంబం కావడంతో కవల పిల్లల పోషణ భారమైన విషయాన్ని తెలుసుకున్న విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ శనివారం గ్రామానికి వెళ్లి కవల పిల్లల కోసం ఆరునెలలకు సరిపడా దుస్తులు, పాల డబ్బాలు, నూనె, సబ్బులు, బాడీ ఆయిల్ తదితర వస్తువులతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కవల పిల్లలకు ఇలాంటి దుస్థితి రావడం బాధాకరమని, భవిష్యత్తులో పిల్లల చదువుకు సహకారం అందిస్తానని తెలిపారు. అదేవిధంగా కవల పిల్లల తండ్రి విజయ్ ఫిట్స్‌తో బాధపడుతున్నందునా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య ఖర్చులు భరిస్తానని హామీనిచ్చారు.

రమాబాయికి పలువురి నివాళి


నర్సాపూర్: రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయికులు


పెద్దశంకరంపేటలో..

నర్సాపూర్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సతీమణి రమాబాయి గొప్ప మహనీయురాలుగా స్వేచ్ఛ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ రమేశ్ అన్నారు. శనివారం ఆమె వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె గొప్పతనాన్ని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో రమేశ్‌తో పాటు కుల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వహిద్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు శంకర్, ఇతర ప్రతినిధులు రఫీ, సంజీవ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో రమాబాయి చిత్రపటానికి కేంద్ర ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్, విగ్రాం రామాగౌడ్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్ మహంకాళి కృష్ణమూర్తి, గంగాధర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, నాగరాజు, కృష్ణ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రావతరణ ఉత్సవాలపై సమావేశం


మాట్లాడుతున్న ఏడీఏ శివకుమార్

రాయికోడ్ (అందోల్): రాయికోడ్‌లోని రైతు వేదికలో శనివారం ఏడీఏ శివకుమార్ అధ్వర్యంలో రాయికోడ్, మునిపల్లి, వట్పల్లి మండలాలకు చెందిన ఏఈఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా రైతు వేదికలను మామిడి తోరణాలు, పూలు, లైటింగ్ తో అలంకరించాలన్నారు. రైతుబంధు, భీమా పథకాలు, ఉచిత విద్యుత్ తదితర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓలు అభినాష్‌వర్మ, మహేష్ చౌహాన్, ఆయా మండలాల ఏఈఓలు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధులు

నర్సాపూర్: ఇమ్రాన్‌పై దాడి చేసిన వారిపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని స్వేచ్ఛ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. స్వేచ్ఛ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ రమేశ్, కో కన్వీనర్లు వహీద్, శంకర్‌ల బృందం శనివారం నర్సాపూర్‌లో పర్యటించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ... ఈనెల 5న గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో జరిగిన వివాదాన్ని సాకుగా చూపి హనుమాన్ స్వాములు ఇమ్రాన్‌పై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇమ్రాన్‌పైనే కేసు నమోదు చేసి జైలుకు పంపడం అన్యాయమని వారన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి, ఇమ్రాన్‌పై కేసులు ఎత్తి వేయాలని రమేశ్, వహిద్, శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. వారి వెంట దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు సంజీవ, కుల నిర్మూలన సంఘం నాయకుడు రఫీ తదితరులు ఉన్నారు.

రవాణా ఇబ్బందులు లేకుండా చూస్తాం


కొల్చారం రైస్‌మిల్లులో ధాన్యం అన్‌లోడ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని త్వరగా రైస్ మిల్లులకు రవాణా, అన్‌లోడ్ చేయడంపై రైతుల నుంచి వస్తున్న ఒత్తిళ్లపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. శనివారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పోతంశెట్టిపల్లి, కిష్టాపూర్, రాంపూర్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయడంతో పాటు లారీలు, ట్రాక్టర్లలో ధాన్యం రవాణా చేసేందుకు చర్యలు తీసుకున్నారు. రైస్‌మిల్లుల యజమానులు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసి, ఖాళీ అయిన లారీలను, ట్రాక్టర్లను తిరిగి కొనుగోలు కేంద్రాలకు వెళ్లేలా కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంలో ఏమాత్రం అలసత్వం వహించొద్దని సూచించారు. రైతులకు అధికారులు పూర్తి అందుబాటులో ఉన్నారని ఈ సందర్భంగా తహసీల్దార్ పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ట్రిబుల్ ఆర్ కేంద్రం సందర్శన



రామచంద్రాపురం(పటాన్‌చెరు) నిరుపయోగ వస్తువులు, పాత వస్త్రాలు, పాత షూ, తదితర వస్తువులను మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ట్రిబుల్ ఆర్ కేంద్రాల్లో ఇవ్వాలని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కోరారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ట్రిబుల్ ఆర్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రీసైకిల్ ప్రక్రియకు పనికి వచ్చే వస్తువులను స్వచ్ఛందంగా ముందుకువచ్చి రెడ్యూస్, రియ్యూస్, రిసైక్లింగ్ కేంద్రాల్లో అందజేస్తే వాటిని పేదలకు పంపిణీ చేస్తామని తెలిపారు. జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చేపట్టిన మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ సీపీఆర్‌పై అవగాహన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రపంచ ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా శనివారం పట్టణంలోని లింగంపల్లి చౌరస్తాలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అత్యవసర సమయంలో సీపీఆర్‌ను ఏ విధంగా నిర్వహించాలో వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, వైద్యులు రవీంద్ర, శశివర్ధన్, రవితేజ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

◆ మజ్జిగ పంపిణీ

జోగిపేట(అందోల్): జోగిపేటలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో శనివారం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతి శని, గురువారాల్లో మజ్జిగను, మిగతా వారాల్లో తాగునీటిని అందజేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు బస్వసత్యప్రకాశ్, సత్యసాయి సేవా సమితి భక్తులు పాల్గొన్నారు.

◆ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

హత్నూర(సంగారెడ్డి): సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. మండల జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించిన సిరిపురం గ్రామానికి చెందిన సుప్రియ, అమూల్యను సర్పంచ్ విజయలక్ష్మినరేందర్ ఉపసర్పంచ్ వసంత సన్మానించి హైదరాబాద్‌కు పంపించారు. సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థినులు పాల్గొనడం సంతోషంగా ఉందని పీఈటీ కిష్టయ్య తెలిపారు.

◆ జీలుగ విత్తనాల పంపిణీ ప్రారంభం



జిన్నారం(పటాన్‌చెరు): 65 శాతం సబ్సిడీపై అందజేసే జీలుగ విత్తనాల పంపిణీని జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు సంజీవరెడ్డి గుమ్మడిదలలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 కేజీల జీలుగు బస్తా సబ్సిడీలో రూ.843 వస్తోందని, బస్తా 2 ఎకరాలకు సరిపోతుందన్నారు. జీలుగ విత్తనాలు కావాల్సి రైతులు తమ పట్టాపాస్ బుక్కు, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ఆస్మిత, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, హుస్సేన్, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండలం బొల్లారం మున్సిపాలిటీకి చెందిన రమణమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో స్థానిక బీఆర్ఎస్ నాయకుల సలహా మేరకు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శనివారం రూ.2.5 లక్షల ఎల్‌ఓసీని రమణమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి పాల్గొన్నారు.

◆ నేడు ఎల్లమ్మ వార్షికోత్సవం

మునిపల్లి(అందోల్): ఈ నెల 28వ తేదీన మండలంలోని తాటిపల్లి గ్రామంలో ఎల్లమ్మ అమ్మవారి వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గౌడ సంఘం నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

◆ స్వచ్ఛ ఆటో కార్మికులకు సన్మానం

రామచంద్రాపురం (పటాన్ చెరు): ట్రిపుల్ ఆర్ కార్యక్రమంలో భాగంగా పాత వస్తువులను సేకరించిన స్వచ్ఛ ఆటో కార్మికులను శనివారం స్థానిక కార్పొరేటర్ పుష్పనగేష్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంట్లోని పాత వస్తువులను స్వచ్ఛ ఆటో కార్మికులు సేకరించి కేంద్రాలకు అందిస్తున్నారని, సేకరించిన సేకరించిన వస్తువులను పేదలకు అందజేస్తామని తెలిపారు.

◆ కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



జోగిపేట(అందోల్): మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు లబ్దిదారులకు సర్పంచ్ యాదాగౌడ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ మానిక్‌రెడ్డి శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించినట్లు తెలిపారు.